అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందేనా!

పెద్దేముల్, మే 7 : పెద్దేముల్ మండలానికి సుమారు 600 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. తక్కువ ఇండ్లు మంజూరు కావడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు గోడవలు గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. ఇందిరమ్మ కమిటీలను నియమించి వారి ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలన్న నిబంధన ఉన్నా ఆది క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ లీడర్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఒకరికి తెలియకుండా ఇంకొకరు నియోజకవర్గ స్థాయి లీడర్లకు లబ్ధిదారుల ఎంపిక చేసిన లిస్టులను సమర్పిస్తున్నారు. ఇందులో చిత్రమేమిటంటే ఆ గ్రామాల్లో ఉన్న ఇందిరమ్మ కమిటీల సంతకాలు లేనిదే అర్హుల జాబితా తయారు చేయడం, వారికి కనీస సమాచారం లేకుండా ఆ జాబితాను నియోజ కవర్గ స్థాయి నాయకులకు సమర్పిస్తున్నారు. దీంతో గ్రామాల్లో నిజంగా గూడు లేని నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. మా అనుచరులకు ఇండ్లు పెట్టాలంటూ లేదు మా అనుచర్లకు ఇండ్లు పెట్టాలంటూ గ్రూప్ గొడవలు గ్రామాల్లో మొదలయ్యాయి. ఈ పరిణామంతో గ్రామాల్లోని అర్హులైన వ్యక్తులు లీడర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ స్థాయి నాయకులు స్పందించి గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

దోమ, మే 7: దోమ మండల పరిధిలోని పరిగి నుంచి ఊటుపల్లి గ్రామం మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. ప్రమాదాల నివారణకు ఎలాంటి కంచె వేయకుండానే ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. భూమికి అతి కింది భాగంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో రహదారి గుండా వెళ్లే ఎద్దు లు, గేదెలు, మేకలు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు కంచెను వేసి రక్షణ కల్పించాలని ఊటుపల్లి గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

అర్కతలలో అన్నీ సమస్యలే

పాఠశాల పక్కనే ఉన్న చెత్తాచెదారం

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నవాబుపేట, మే 7: మండల పరిధిలోని అర్కతల గ్రామంలోఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం, రోడ్లపై పారుతున్న మురుగు నీరు దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎన్నోసార్లు మండల అధికారులు, గ్రామానికి చెందిన సెక్రెటరీ దృష్టికి తీసుకువెళ్లినా కూడా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. ఇంటి పన్నులు బాగానే వసూలు చేస్తున్నారు కానీ ఇండ్ల ఎదుట మాత్రం చెత్తాచెదారం, మురుగు నీరు పారుతుండటంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు. కనీసం జిల్లా అధికారులైన తమ బాధలను పట్టించుకుని తీర్చితే బాగుండు అని వారు పేర్కొంటున్నారు. డంపింగ్‌యార్డు కూడా సరిగ్గా వాడుకోకుండా అస్తవ్యస్తంగా ఉంది. అక్కడ తాగిపడేసిన సీసాలు తప్ప తడిచెత్త, పొడిచెత్త అంటూ వేరు చేసి హరి త హారం మొక్కల కోసం ఎరువును కూడా తయారు చేయడం లేదు. గ్రామానికి చెందిన నర్సరీలోని మొక్కలు కూడా ఎండుముఖం పట్టడం కనిపిస్తుంది.

నర్సరీలో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు

ఎన్నిసార్లు చెప్పినా లాభం లేదు

గ్రామంలో చెత్తాచెదారం గూర్చి ఎన్నిసార్లు చెప్పిన కూడా అధికా రులు పట్టించుకోవడం లేదు. ఇంటి పన్నులు బాగానే కడుతున్నాం కానీ ఇంటి ముందు చెత్తాచెదారం, మురుగు నీరు మాత్రం అలాగే ఉంచుతున్నారు. సమస్యలపై ఎన్నోసార్లు కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లిన కూడా కనికరించడంలేదు. కలెక్టర్ సార్ అయినా మా సమస్యను తీర్చాలని కోరుకుంటున్నాం.

– మణెమ్మ

దుర్వాసన భరించలేకపోతున్నాం

మా బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థం కానీ దుస్థితి . సర్పంచులు ఉంటే వారికైనా బాధను వెల్లబోస్తుంటిమి. ఇపుడు సర్పంచ్ ఎవ్వరూ లేరు. గ్రామానికి కార్యదర్శి మాత్రమే ఉంది. ఆమెకు చాలా సార్లు చెప్పాం ఆమె పట్టించుకోవడంలేదు మా దగ్గర డ్రైనేజీ వ్యవ స్థ కూడా సరిగ్గా పనిచేయకనే రోడ్డుపై మురుగు నీరు పారుతుంది, దీనికి తోడు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు దాంతో మురుగు వెదజల్లుతుంది . కొత్తగడి మల్లమ్మ

అండర్ డ్రైనేజీ ఇప్పట్లో కాదు ..

రోడ్డుపైన మురుగు నీరు పారుతుంది నిజమే కానీ దానిని పరిష్కరించాలి అంటే ఇప్పటంతల కాదు. సర్పంచులు వచ్చిన తర్వాతనే అండర్ డ్రైనేజీకి పరిష్కారం దొరుకుతుంది. ఊరు మధ్యలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి తగ్గిన చర్యలు తీసుకుంటా. మొన్ననే గ్రామానికి సంబంధించిన స్పెషలాఫీసర్‌తో కలిసి గ్రామంలో తిరిగాను. వారానికి ఒక్కసారి చెత్తను తీయడానికి ట్రాక్టర్‌ను పంపిస్తున్నా –ఉమ, పంచాయతీ సెక్రటరీ, అర్కతల గ్రామం

ఎంఆర్‌సీకి చేరిన మధ్యాహ్న భోజన వంటపాత్రలు

బొంరాస్‌పేట్,మే 7: ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటపాత్రలు మండల విద్యావనరుల కేంద్రానికి బుధవారం చేరినట్లు మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. మొత్తం 65 వంటపాత్రలు వచ్చాయని పాఠశాలలు పునఃప్రారంభం అయిన వెంటనే మండల పరిధిలోని ప్రతి పాఠశాలకు పంపించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 51పాఠశాలలు ఉన్నాయని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంటపాత్రలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సోమ్లనాయక్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బొంరాస్‌పేట్, మే 7 : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు సైబర్ నేరాల పై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ట్రైనీ ఎస్ఐ మోహన్ కృష్ణ తెలిపారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, లింకులు,వాట్సాప్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయారాదన్నారు. అలాంటి లింకులను క్లిక్ చేయడం ద్వారా మన బ్యాంకు ఖాతాలలో ఉన్న డబ్బులు పోతాయన్నారు. ఏదైన సమస్యలు ఉంటే ఖాతాదారులు నేరుగా బ్యాంకుకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

హుస్సేన్‌పూర్ పాఠశాలలో సమ్మర్ క్యాంపు

కొడంగల్, మే 7: మండలంలోని హుస్సేన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు 15 రోజుల పాటు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్ సమ్మర్‌క్యాంపు నిర్వహించి విద్యార్థుల విద్యా నేర్పుకు కృషి చేస్తున్నారు. వారం రోజులుగా విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్, డ్యాన్స్, సాంగ్స్, మ్యూజిక్, స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, ఏకపాత్రభినయం, తెలంగాణ ట్రెడిషన్ ఆర్ట్స్, డ్రాయింగ్ వంటి వాటిలో శిక్షణ అందిస్తున్నారు.

పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్,మే 7 : నూతనంగా ఏర్పడిన దుద్యాల మండలంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం బుధవారం ఎస్ఐ యాదగిరి పనులను ప్రారంభించారు. ప్రస్తుత పోలీస్‌స్టేషన్ తాత్కాలిక భవనంలో ఉంది. అందుకుగాను దుద్యాల గేట్ సమీపంలో ఉన్న 1090 సర్వే నంబరులో 2.18ఎకరాల భూమిని కేటాయించి ప్రభుత్వం కొత్తగా పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ విట్టల్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కులకచర్ల, మే 7 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. బుధవారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, మాజీ ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, మాజీ వార్డు సభ్యుడు బాలకిష్టయ్య, రైతులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే

పరిగి, మే 7 : వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం పరిగిలో నిర్వహించిన శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో పూడూరు మాజీ జెడ్పీటీసీ మలిపెద్ది మేఘమాల–ప్రభాకర్ గుప్త దంపతులు, మాజీ మార్కెట్ చైర్మన్ ఎ.సురేందర్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మధుసూదన్, ఆకారపు రాజు, రాము, కిరణ్, అరవింద్, మహిళా సంఘం అధ్యక్షురాలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై సంబురాలు

కులకచర్ల, మే 7 : భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో కులకచర్లలో అన్ని పార్టీల నాయకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, యువకులు కలిసి సంబురాలు జరుపుకున్నారు. పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని భారత ఆర్మీకి అండగా ఉంటామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాలను ప్రదర్శించారు.

ఉదయం వేళ లో ఉపాధి హామీ పనుల నిర్వహణ

కులకచర్ల, మే 7: మండల పరిధిలోని కామునిపల్లి గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ అనిత మాట్లాడుతూ ఉదయం వేళలో ఉపాధిహామీ పనులను నిర్వహిస్తున్నామన్నారు. ఎండకాక ముందుగానే నిర్ణయించిన సమయం ప్రకారం పనులు చేసే విదంగా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోర వెంకటేశ్, ఎల్లారెడ్డి, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెలించవచ్చు

వికారాబాద్, మే 7 : ఇంటర్ అడ్వాన్స్ సప్లీమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 8వ తేదీ వరకు వెయ్యి రూపాయల అపరాధ రుసుము తో పరీక్ష ఫీజును సంబంధిత కళాశాలలలో చెల్లించ వచ్చునని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్. శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి తల్లి దండ్రులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులు పరీక్ష ఫీజు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిని పరీక్షలు వ్రాసే విద్యార్థులు దృష్టిలో ఉంచుకొని పరీక్షలఫీజు చెల్లించాలన్నారు.

అణగారిన వర్గాల ధైర్యం అంబేద్కర్

అంబేద్కర్ విగ్రహావిష్కరణలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు, సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్, మే 7 : దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనులు తలేత్తుకుని బతుకుతున్నారంటే ఆ ధైర్యం పేరే డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి కూడలీలో చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కాలే యాదయ్య లతో కలిసి భారత రత్న, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీంరావు అంబేద్కర్ 12 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....అంబేద్కర్ ఒక చరిత్ర కాదు నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు అంబేద్కర్ అన్నారు. తాను శాసనసభ స్పీకర్ కావడానికి ఆయన కల్పించిన రిజర్వేషన్ల బిక్షనే అని కొనియాడారు. అంబేద్కర్ అనేది ఒక పేరు కాదు, అది ఈ దేశ ప్రజల జీవన రేఖ అన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాల జీవితాలకు వెలుగును ఇచ్చిన సూర్యుడని ఆకాంక్షించారు. భూ ప్రపంచం ఉన్నంత వరకు ఆయన పేరు ఉంటుందని, ఈరోజు ఢిల్లీ నుంచి గల్లీ వరకు పార్లమెంట్ నుండి గ్రామ పంచాయతీ ల వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సజావుగా జరుగుతున్నది అంటే దానికి కారణం అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగమేనని ఆయన అన్నారు. అంబేద్కర్ ఒక కులానికో, మతానికో సంబంధించిన వారు కాదని, ఆయన ఈ దేశ ప్రజల ఆస్తి అని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ బాబాసాహెబ్ ఆశయాలు కొనసాగించడమే ఆ మహనీయునికి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఇక్కడున్న వారందరం రాజకీయాలు కాకుండా అంబేద్కర్ ఆలోచన విధానాలను , ఆశయాలను ప్రజలకు తెలియజేసే విధంగా మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థిక కమిటీ సభ్యులు రమేశ్ మహారాజ్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, ఆర్టీఏ మెంబర్ జాఫర్, దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌ముదిరాజ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన డీసీఎం

యువకుడు మృతి, మహిళకు గాయాలు

పరిగి, మే 7: డీసీఎం డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టగా యువకుడు మృతిచెందడంతో పాటు మహిళకు గాయాలయ్యాయి. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కొందుర్గుకు చెందిన బోయ మల్లమ్మ, ఆమె కుమారుడు భాను (20)లు స్కూటీపై బుధవారం ఉదయం పరిగికి ఆసుపత్రికి వచ్చి తిరుగు ప్రయాణంలో కొందుర్గుకు వెళ్తుండగా ఉదయం 8.10 గంటల ప్రాంతంలో చిట్యాల్ స్టేజీ వద్ద షాద్‌నగర్ నుంచి పరిగి వైపు వస్తున్న డీసీఎం డ్రైవర్ అతివేగంగా నడుపుతూ వచ్చి స్కూటీని ఢీకొ ట్టాడు. దీంతో స్కూటిని నడిపిస్తున్న భాను తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తల్లి మలమ్మకు గాయాలయ్యాయి. మల్లమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో ఈతకు వెళ్ళి బాలిక మృతి

బొంరాస్‌పేట్, మే 7: మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి సమీపంలో ఉన్న పటేల్ చెరువులో ఈతకు వెళ్ళి ఒక చిన్నారి మృతి చెందిన సంఘటన చోటుచెసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగడి మైలారం గ్రామానికి చెందిన బలిజ ప్రవీణ్‌కుమార్ కుమార్తె భవ్యశ్రీ (10) బుధవా రం ఉదయం స్నేహితులతో కలిసి ఉదయం 11గంటల సమయంలో చెరువులో ఈతకు వెళ్లింది. ఆ సమయంలో భవ్యశ్రీ చెరువులోపల ఉన్న గుంతలను గమనించకపోవడంతో గుంత లోతుగా ఉండడంతో అందులోని నీటిలో మునిగిపోయింది. గమనించిన స్నేహితులు భయపడి పారిపోయారు. అక్కడే ఉన్న బాలిక చెల్లెలు, తమ్ముడు గట్టిగా ఎడవడంతో సమీపంలో ఉన్న గొర్రెలకాపరులు అక్కడికి చెరుకొని విషయం తెలుసుకొని బాలిక కోసం చెరువులో వెతుకుతున్న సమయంలో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. గోర్రెలకాపరులతోపాటు గ్రామస్తులు కూడా బాలిక కోసం చెరువులో వెతకడంతో బాలిక మృతదేహం లభించిందని తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో 24 ఫిర్యాదులు



అల్లీపూర్ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ధారూరు మే7: మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సుకు మొత్తం 24 ఫిర్యాదులు వచ్చినట్లు ధారూరు తహసీల్దార్ సాజిదాబేగం అన్నారు. బుధవారం ధారూరు మండల పరిధి లోని అల్లీపూర్, అల్లాపూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో 24 ఫిర్యాదులు వచ్చాయి. అల్లీపూర్ రెవెన్యూ సదస్సులో 17 ఫిర్యాదులు, అల్లాపూర్ గ్రామ రెవెన్యూ సదస్సులో 7 ఫిర్యాదులు వచ్చాయి. బుధవారం మండల పరిధి లోని అల్లాపూర్, అల్లీ పూర్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధారూరు, కోట్ పల్లి తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది రైతులు ప్రజలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోమిన్‌కలాన్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పీఎసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయబాస్కర్ రెడ్డి తదితరులు –ధారూరు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962